క్లుప్తంగా

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



రామన్నపాలెంలో ఈ-క్రాప్ నమోదు పర్యవేక్షిస్తున్న ఏఓ అబ్దుల్ రహీమ్

మొగల్తూరు: ప్రతి రైతూ తాను పండించే పంట వివరాలను ఈ-క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోలని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ సూచించారు. మండంలోని రామన్నపాలెం 2వ సచివాలయ పరిధిలోని పలు ప్రాంతాలలో నిర్వహిస్తున్న ఈ-క్రాప్ విదానాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాను పండించే పంట వివరాలను రెవెన్యూ అధికారి లేదా రైతు భరోసా కేంద్రం వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. మండలంలో సార్వా సాగు చేపట్టిన 1198 ఎకరాలకు సంబంధించి ఇప్పటి వరుకు 467 ఎకరాలు మాత్రమే నమోదైందన్నారు. గత నెలలో కురిసిన వర్షాలకు చేలు మునిగిపోయి నీరు బయటకు లాగకపోవడం లేదా ఆకుమడులు మునిగి పోవడం తదితర కారణాలతో సాగు ఆలస్యమైందన్నారు. ఈక్రాప్ నమోదు కావడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు వర్తిస్తాయని పేర్కొన్నారు.

నరసాపురంలో భారీ వర్షం



వర్షం నీటితో మునిగిపోయిన అన్నపూర్ణ థియేటర్ రోడ్డు

నరసాపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా శుక్రవారం నరసాపురంలో భారీ వర్షం పడింది. ఉదయం నుంచి ముసురుపట్టి చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. అయితే వాతావరణం సాయంత్రం 4 గంటల సమయంలో పూర్తిగా మారింది. వర్షం తీవ్రత ఎక్కువ కావడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రెయిన్స్ పొంగిపొర్లడంతో బస్టాండ్, స్టీమర్‌రోడ్డు, ప్రకాశం రోడ్డు ప్రాంతాలు నీట మునిగాయి. ఇంటికి చేరే సమయంలో వర్షం పడడం వల్ల పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఇళ్లకు చేరుకోవడానికి నానా అవస్థలు పడ్డారు.

విద్యార్థులకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

నరసాపురం: మలేరియా, డెంగీ వంటి విష జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కార్యాలయ ఏఓ సీహెచ్ పెద్దిరాజుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి డి.అనిల్‌బాబు మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో విద్యార్థులు విషజ్వరాల బారిన పడుతున్నారని అన్నారు. సాధారణ జ్వరాలే అని నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రమాదాల అంచుకు వెళుతున్నారని వాపోయారు. ప్రభుత్వం స్పందించాలని, హాస్టళ్లలో పరిస్థితులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు.

రాజుగూడెంలో ఆరోగ్య శిబిరం



ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: పెనుగొండ మూడవ సచివాలయం రాజుగూడెంలో శుక్రవారం ఆరోగ్య శిబిరం నిర్వహించి రోగులకు ప్రాథమిక వైద్యం అందించారు. ఇటీవల జ్వరాలు, జలుబు, ఒళ్లు నొప్పుల బాధితులు అధికంగా ఉండడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేసి మందులు అందించారు. వాతావరణ పరిస్థితులు ఇబ్బందికరంగా ఉండడంతో జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది చంద్రశేఖర్ రెడ్డి, అభిషేక్, కె.వాసవీదేవి, ఎం.సేరామ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

భీమవరం: మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జిల్లాలో మూడు రోజులపాటు నిర్వహించిన క్రీడా పోటీలు ముగిసినట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎం.రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలలలో వివిధ క్రీడా పోటీలను నిర్వహించామన్నారు. యోగ, టేబుల్ టెన్నిస్, ఫుడ్ బాల్, వాలీబాల్, క్యారమ్స్, చెస్, బ్యాడ్మింటన్, వాక్‌రెస్, రోప్ జప్పింగ్, బాస్కెట్ బాల్, రన్నింగ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించగా పోటీల్లో విజేతలకు ప్రశంస పత్రాలు అందజేస్తామని రాజేష్ తెలిపారు.

పంటలకు ఎలుకల బెడద



వరి పంటను కొరుకుతున్న ఎలుక (ఫైల్)



ఎలుకలను పట్టడానికి బుట్టలు సిద్ధం చేస్తున్న వేటగాడు (ఫైల్)

ఆర్థికంగా నష్టపోతున్న రైతులు

యలమంచిలి: వరి, ఉద్యానవన పంటలకు ఎలుకల బెడద ఎక్కువైంది. ముఖ్యంగా వరి పంటను మూషికాలు నాశనం చేస్తున్నాయి. సార్వా సీజన్‌లో ఆకుమడుల దశ నుంచి కుప్పల వరకూ ఈ సమస్య రైతులకు తప్పడం లేదు. దీంతో రైతులు అధికంగా నష్టపోతున్నారు. పంట వేసినప్పటి నుంచి పంట చేతికి వచ్చేవరకు ఎలుకల బెడద ఉంటుంది. ఎలుకలను సమర్థంగా అరికట్టాలంటే రైతులంతా సామూహిక ఎలుకల నిర్మూలన చర్యలు చేపట్టడం వల్లే సాధ్యమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వరితోపాటు ఉద్యానవన పంటలైన కొబ్బరి, అరటి, కాయకూరల తోటలకు ఎలుకల బెడద ఉంది. ప్రస్తు తం వరి పంట దుబ్బు చేసి పిలకలు వేసే దశలో ఉంది. ఈ దశలో ఎలుకల వలన కలిగే నష్టం అపారంగా ఉంటుంది. ఎలుకలు నీటి మట్టానికి 6 సెంటీమీటర్ల ఎత్తులో వరి పిలకలను కొరికి వేస్తున్నాయి. దీంతో దిగుబడితగ్గి రైతులు నష్టపోతున్నారు.

గుర్తించే విధానం

ఎలుకలు సంచరించే పొలం గట్లపై బొరియలు ఉంటాయి. పొలంలో కొరికి వేసిన వరి పిలకలు, దుబ్బులు పడి ఉంటాయి. పొలంలోని బురదలో ఎలుకల పాదముద్రలు కనిపిస్తాయి. ఎలుకలు విసర్జించిన పదార్థాల ద్వారా వాటి ఉనికిని సులభంగా గుర్తించవచ్చు.

నివారణ చర్యలు

ముందుగా రైతులు తమ పొలం గట్లపై కులపు మొక్కలను పూర్తిగా తొలగించి శుభ్రం చేసుకోవాలి. ముఖ్యంగా బ్రొమోడయోలిన్ ఎరతో ఎలుకలను సామూహికంగా నివారించాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. 480 గ్రాముల నూకలు, 10 గ్రాముల బ్రొమోడయోలిన్ మందు, 10 గ్రాముల నూనెతో 500 గ్రాముల ఎరను తయారు చేయవచ్చు. ఆ ఎర 50 ఎలుక బొరియలకు సరిపోతుంది. మొదటి రోజు ఎలుక బొరియలను గుర్తించి మట్టితో కప్పివేయాలి. రెండో రోజు మట్టితో కప్పిన బొరియలను చూస్తే తెరుచుకున్న బొరియలు కనిపిస్తాయి. ఆ బొరియల వద్ద 10 గ్రాముల బ్రొమోడయోలిన్ ఎర పొట్లాలను ఉంచాలి. దీంతో ఆ ఎరను తిన్న ఎలుకలు చనిపోతాయి. ఇక రెండవ విధానంలో వేటగాళ్ల ద్వారా ఎలుక బుట్టలు వేయించి ఎలుకలను అరికట్టవచ్చు. అయితే ఈ విధానంలో వేటగాళ్లు ఒక్కో ఎలుకకు రూ.60 వరకు తీసుకుంటారు. మరో విధానంలో ఎలుక బొరియలో పొగ పెట్టి ఎలుకలను చంపుతారు. ఇలా చేస్తే ఒక్కో ఎలుకకు రూ.100 తీసుకుంటారు. ఈ రెండు విధానాలు అధిక ఖర్చుతో కూడిన పని కావడంతో రైతులంతా బ్రొమోడయోలిన్ ఎర ద్వారానే ఎలుకల నివారణ చేయడం సులభంగా జరిగే పని అని వ్యవసాయాధికారులు చెబున్నారు. అయితే ఏ విధానంలో చేసినా రైతులంతా సామూహికంగా ఈ పని చేస్తేనే ఎలుకలను సమర్థంగా అరికట్టగలమని వారు చెబున్నారు.

సామూహికంగానే సమర్థంగా



సార్వా పంటకు ఎలుకల బెడద ఎక్కువగానే ఉంటుంది. ఎలుకలను నిర్మూలించడం సాధ్యం కాదు. సామూహికంగా బ్రొమోడయోలిన్ మందును పెట్టడం ద్వారా మాత్రమే సమర్థంగా అరికట్టగలం. ఎలుకలను అరికట్టడానికి అవసరమైన బ్రొమోడయోలిన్ మందు కొద్ది రోజుల్లో రైతు భరోసా కేంద్రాలకు వస్తుంది. దీనిపై రైతులకు ప్రతి ఏడాది అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, మందును ఉచితంగా అందజేస్తున్నాం.

– ఈద అనిలకుమారి, సహాయ వ్యవసాయ సంచాలకులు, నరసాపురం డివిజన్

కాంపౌండర్ నుంచి అడిషనల్ డైరెక్టర్ స్థాయికి



కర్నేని బాలకృష్ణ

పాలకొల్లు అర్బన్: ఆర్మీ విభాగంలో అడిషనల్ డైరెక్టర్ హోదాలో శుక్రవారం విశాఖలో కర్నేని బాలకృష్ణ పదవీ విరమణ చేశారు. ఆయన జీవితం ఆదర్శనీయమని పలువురు ప్రముఖులు చెబుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఐదో తరగతితో చదువు ఆపేసిన బాలకృష్ణ పట్టణంలోని కొబ్బరికాయల షాపులో గుమస్తాగా పనికి కుదిరారు. చదువు మీద ఆసక్తితో 10వ తరగతి ప్రైవేటుగా చదివి, అనంతరం పట్టణంలోని ఓ వైద్యుని వద్ద కాంపౌండర్‌గా పని చేసుకుంటూ ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాలలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం ఆంధ్రా యూనివర్శిటీలో ఎంఏ (అప్లెయిడ్ ఎకనామిక్స్) చదివారు. అనంతరం గ్రూప్ 2లో కేడర్‌లో అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్, డిప్యూటీ తహసిల్దార్ ఉద్యోగాలు సాధించారు. విజయవాడలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ సివిల్స్‌లో ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంక్ సాధించి ఆర్మీ విభాగంలో అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్, పూణేలో 1996లో విధుల్లో చేరారు. పూణే, కలకత్తా, అండమాన్ నికోబార్ దీవులు, బెంగుళూరు, న్యూఢిల్లీ, హైదరాబాద్, విశాఖ పట్టణంలో పలు హోదాల్లో పని చేశారు. శుక్రవారం విశాఖపట్టణంలో అడిషనల్ డైరెక్టర్ హోదాలో పదవీ విరమణ చేశారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



రైల్వేస్టేషన్‌రోడ్డులో మొక్కలు నాటుతున్న దృశ్యం



కొడమంచిలిలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ

నరసాపురం: ప్రతి ఒక్కరూ ఒక్క మొక్కనైనా పెంచడం అలవాటుగా చేసుకోవాలని నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ సూచించారు. శుక్రవారం పట్టణంలోని 30వ వార్డు రైల్వేస్టేషన్ రోడ్డులో వనం-మనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వెంకటరమణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచడమే ఏకైక మార్గమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ అడిదల శ్యామల, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు, అడిదల శరత్ తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొగల్తూరు పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు, కూటమి పార్టీ నాయకులు శుక్రవారం గ్రామంలో మొక్కలు నాటారు.

ఆచంటలో..

పెనుగొండ: వనమహోత్సవంతో భవిష్యత్తు తరాలకు కాలుష్య రహిత వాతావరణం కల్పించి మంచి సమాజాన్ని అందించాలని ఆచంట ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి అన్నారు. శుక్రవారం ఆచంట మండలం కొడమంచిలిలో వనమహోత్సవం ప్రారంభించారు. కొడమంచిలి పరిసర ప్రాంతాల్లో మొక్కలను నాటారు. ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహమూర్తి, మండల విస్తరణాధికారి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ మండలంలో

పెనుగొండలో సర్పంచ్ నక్కాశ్యామలా సోనీ శాస్త్రి, వడలిలో సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు, సిద్ధాంతంలో చింతపల్లి గనిరాజు(చంటి) ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు వనమహోత్సవాలు ప్రారంభించారు. వడలివలో వనాల్ని రక్షించాలంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కాకిబాల వెంకట సత్యనారాయణ, పులుగోరు రవికుమార్, చిట్టూరి పూర్ణ చంద్రశేఖర్, గ్రామ కార్యదర్శి టి.రత్నాకర రావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో

పాలకొల్లు సెంట్రల్: ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలను నాటడం వల్ల భవిష్యత్ తరాల ప్రజలకు మంచి పర్యావరణం కలిగిన సమాజాన్ని అందించవచ్చని మునిసిపల్ కమిషనర్ విజయసారధి అన్నారు. శుక్రవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వనం మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి మాట్లాడుతూ వనం మనం కార్యక్రమంలో భాగంగా కళాశాల దత్తత గ్రామాలైన యాళ్లవానిగరువు, అడవిపాలెం గ్రామాల్లో జామ, అరటి, కొబ్బరి, సీతాఫలం, రామాఫలం, నేరేడు, ఔషధ వంటి 100 మొక్కలను నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డీఈ రాజ్‌కుమార్, ఏఈ సాంబశివుడు, వైస్ ప్రిన్సిపాల్ టి కృష్ణ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం పార్క్‌లో స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు



అబ్దుల్‌కలాం పార్క్‌లో బోట్ షికార్‌కు స్టీల్ గ్రిల్‌తో మెట్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: ఏపిజే అబ్దుల్ కలాం పార్క్ (శంభుని చెరువు)లో బోట్ షికారు ఏర్పాటు చేయనున్నట్లు మునిసిపల్ కమిషనర్ విజయసారధి తెలిపారు. శుక్రవారం బోట్ షికారు నిమిత్తం ఏర్పాటు చేసిన మెట్లకు స్టీల్ గ్రిల్, స్టీల్ మెట్లును పరిశీలించారు. ఈ పార్క్‌లో అతి త్వరలో బోట్ షికార్‌తో పాటు స్విమ్మింగ్ పూల్ పనులు పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే పార్క్‌లో సూర్యనమస్కారాల నమూనాలు, వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలతో ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తుంది.

పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నరసాపురం రూరల్: ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ని పునరుద్ధరించాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం నరసాపురం తహసీల్దార్ రాజరాజేశ్వరికు యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు మార్కండేయులు, జిల్లా కార్యదర్శి కృష్ణకుమారి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పి.శ్రీనివాస్, ఎన్వీ సత్యనారాయణ, అజయ్‌కుమార్, శాంసన్, లక్ష్మీకళ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

భీమవరం (ప్రకాశంచౌక్): నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం ఉదయం భీమవరం డిపో గ్యారేజీ ఆవరణలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వైవీ రావు మాట్లాడుతూ 114 జీఓ ప్రకారం నైట్ అవుట్ అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

పింఛన్ల పంపిణీలో అందరూ బాధ్యతగా ఉండాలి



సమావేశంలో సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ విజయసారథి

పాలకొల్లు సెంట్రల్: పింఛన్ల పంపిణీలో మునిసిపల్, సచివాలయ సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని మునిసిపల్ కమిషనర్ విజయసారధి అన్నారు. శుక్రవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో కౌన్సిల్ హాలు సమావేశ మందిరంలో మునిసిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బందికి అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ విజయసారధి మాట్లాడుతూ సెప్టెంబర్ నెల పింఛన్లు ఒకరోజు ముందుగా అంటే శనివారమే పంపిణీ చేయనున్నామని తెలిపారు. పింఛన్ల పంపిణీ వేగంగా పూర్తిచేయాలన్నారు. ముందురోజు అనివార్య కారణాల వల్ల తీసుకోలేని పింఛన్‌దారులు సెప్టెంబర్ 2న తీసుకోవచ్చని సూచించారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: ప్రతి నెలా అందించే సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ వి.బాబ్జీరాజు శుక్రవారం తెలిపారు. మండలంలోని 17 గ్రామాలకు సంబంధించి 10, 644 మంది లబ్ధిదారులకు శనివారం ఉదయం 6 గంటల నుంచి పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పింఛన్లను అందిస్తారన్నారు. శనివారం పింఛన్ అందుకోని వారికి సెప్టెంబర్ 2న అందిస్తామని స్పష్టం చేశారు.

చట్టాలపై అవగాహనతో ఉండాలి

కాళ్ల: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఎస్.శ్రీనివాసరావు సూచించారు. కాళ్ళ మండలం కోలనపల్లి గ్రామంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండటంతోపాటు సమస్యలపై స్పందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను తెలుసుకోవాలని, సక్రమంగా అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఇ.నాగార్జున, సర్పంచ్ కె.సూర్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఉండి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఉండి ఎస్సై నసీరుల్లా అన్నారు. శుక్రవారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ఐటీఐలో గంజాయి, సైబర్ నేరాలు, ఉమెన్ సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్ వంటి పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత మత్తుకు బానిసలు కావడం వల్ల జీవితాలు నాశనం అవుతున్నాయని వాటికి దూరంగా ఉండాలని సూచించారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

పాలకోడేరు: పేద కుటుంబానికి చెంది ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న కుటుంబానికి ఆర్యవైశ్య జిల్లా సంఘం ఆర్థిక సాయం అందజేసింది. విస్సాకోడేరు గ్రామానికి చెందిన మండ సోమేశ్వరరావు భార్య, మానసిక వికలాంగుడైన కుమారుడు నాని తీవ్ర అనారోగ్య సమస్యలతో ఇంటికే పరిమితమై ఉండడంతో స్నేహితుల ద్వారా ఆకివీడుకు చెందిన మండల ఆర్యవైశ్య సంఘం సన్నిధి రామ వెంకటేశ్వరరావు, గొంట్ల గణపతి, గుర్రం శ్రీనివాసరావు తదితర సంఘ సభ్యులు తెలుసుకుని రూ.1.05 లక్షలు సేకరించారు. ఈ సొమ్మును శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిర్లంచర్ల సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి కందగట్ల రఘురాములు ఉపాధ్యక్షుడు కోడూరి కుమార్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి మానవత్వంతో ఆర్థిక సహాయం చేసిన ఆకివీడు మండల ఆర్య సంఘ సభ్యులను ప్రశంసించారు.

ఆక్వా సాగుకు అనుమతులు తప్పనిసరి



సదస్సులో మాట్లాడున్న ఎంపెడా అధికారులు

యలమంచిలి: చేపలు, రొయ్యల సాగుకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటి (ఏపీ సడా) నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని నరసాపురం డివిజన్ మత్స్యశాఖ సహాయ సంచాలకులు సీహెచ్ వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆచంట, యలమంచిలి మండలాల ఆక్వా రైతులకు శుక్రవారం ఏపీ సడా యాక్ట్-2020, ఎంపెడ ఫారమ్ ఎన్‌రోల్‌మెంట్, ఆక్వా సాగులో యాజమాన్య పద్ధతులు గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏపీ సడా ద్వారా అనుమతులు పొందిన రైతులకు అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఎంపెడా టెక్నికల్ అధికారి ఎం.దుర్గారావు మాట్లాడుతూ వనామి రొయ్యల సాగు చేసే ప్రతి రైతు ఎంపెడా ఫార్మ్ ఎన్‌రోల్‌మెంట్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



పాలకొల్లు సెంట్రల్: క్షీరారామంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలు



పెనుగొండ: వడలిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం శుక్రవారం కావడంతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో సుమారు 900 మంది మహిళలు పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ప్రాకారమండపాలతో పాటు అభిషేక మండపంలోనూ కూర్చొబెట్టారు. పూజలో పాల్గొన్న భక్తులకు పూజా కార్యక్రమాలు, లక్ష్మీదేవి ప్రతిమలు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసు, ఆలయ అర్చకులు కిష్టప్ప, అనిల్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా వడలి గ్రామ దేవత మందాలమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి మందాలమ్మకు అర్చనలు, కుంకుమార్చనలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు దుగ్గిరాల నాగేశ్వర శర్మ ఆధ్వర్యంలో సామూహిక వ్రతం నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మొగల్తూరు: ముత్యాలపల్లిలో సామూహిక వరలక్ష్మీ పూజలో పాల్గొన్న భక్తులు



యలమంచిలి: కాంభొట్లపాలెంలో సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు

మొగల్తూరులో...

మొగల్తూరు: శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం కావడంతో మండలంలోని పలు గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మొగల్తూరులోని భవానీ కాలనీలో కనకదుర్గమ్మ ఆలయంలోనూ, రాజగోపాల స్వామి ఆలయంలోనూ నిర్వహించిన సామూహిక పూజలో భక్తులు పాల్గొన్నారు. ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయంలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు- గౌరీ కుంకుమ పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈఓ డి.రామకృష్ణంరాజు, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా కాంబొట్లపాలెం గ్రామంలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం మంగళగౌరీ వ్రతం నిర్వహించారు. ఆలయ అర్చకులు అజయ్ నారాయణ బ్రహ్మత్వంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు, పంచామృతాభిషేకం చేశారు. ముందుగా మాతృ శక్తి విభాగం ప్రాంతీయ ప్రముక్ తొట్టెంపూడి సునీత దేవి దీప ప్రజ్వలన చేసి పూజలు ప్రారంభించారు. విశ్వ హిందూ పరిషత్ మండల కార్యదర్శి దివి ప్రకాష్, సురక్ష ప్రముక్ అనిశెట్టి నరేష్ హిందూ సంఘటిత ఆవశ్యకత గురించి వివరించారు.